సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 30 । డిసెంబర్ । 2022



వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం 8లో



పీఎం కిసాన్‌కు రేపే తుది గడువు 8లో

అద్వితీయంగా సంబరాలు

రెండో రోజు హుషారుగా పాల్గొన్న విద్యార్థులు 8లో



న్యూస్‌రీల్

గిరిజన రైతులకు 1.20 లక్షల చేప పిల్లల పంపిణీ



రైతులకు చేప పిల్లలను అందజేస్తున్న ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమేష్

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా 60 మంది గిరిజన రైతులకు 1.20 లక్షల చేప పిల్లలు (ఫింగర్ లింగ్స్) పంపిణీ చేసినట్టు ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమేష్ గురువారం రాత్రి తెలిపారు. వీటి విలువ రూ. 1.2 లక్షలు ఉంటుందన్నారు. స్థానిక చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో విత్తన చేపపిల్లను పెంచామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు తవ్వించుకున్న వారికి వీటిని ఉచితంగా ఇచ్చామని తెలిపారు. వెయ్యి చేపపిల్లలకు, రవాణా, ప్యాకేజీ తదితర చార్జీల కింద రూ. 150 రైతులు చెల్లించాలన్నారు. ఎకరా చెరువులో కట్ల, రోహు, మృగాల రకాలకు చెందిన రెండు వేల విత్తన చేపపిల్లలు వేసుకోవాలని సూచించారు. ఫిషరీస్ అసిస్టెంట్లు సత్యవతి, సాయి పాల్గొన్నారు.

అరకులోయను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



స్విచ్ ఆన్ చేసి వీధిలైట్లను ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అరకులోయను సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక ఆర్‌టీవీ నుంచి యండపల్లివలస వరకు పంచాయతీ, పాడేరు ఐటీడీఏ, టూరిజం శాఖ నిధులతో ఏర్పాటు చేసిన వీధి లైట్లను గురువారం ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ బల్బుల ఏర్పాటు వల్ల దేశవిదేశాల నుంచి అరకులోయకు వచ్చే పర్యాటకులతో పాటు స్థానికులకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసుబాబు, ఎంపీపీ ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను,ఎంపీటీసీలు శత్రుగున్, ఆనందకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతే ముఖ్యం



పోశమ్మగండి ప్రాంతాన్ని సందర్శిస్తున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్

దేవీపట్నం: పాపికొండల పర్యటనకు వెళ్లే సందర్శకుల భద్రతే ముఖ్యమని దానికనుగుణంగా నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను టూరిజం బోట్లలో కచ్చితంగా పాటించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్‌తో కలిసి పోశమ్మగండి వద్ద పర్యటించారు. టూరిజం కంట్రోల్ రూమ్‌ను సందర్శించి టూరిజం బోట్లలో పర్యాటకుల భద్రతపై ఆరా తీశారు. అన్ని నిబంధనలు పాటిస్తేనే గోదావరిలో విహరించే బోట్లకు అనుమతించాలని తెలిపారు. బోట్లలో లైఫ్‌జాకెట్లు సరిపడా ఉండేలా చూడాలని, ప్రతీఒక్కరూ లైఫ్ జాకెటు ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిమితికి మించి పర్యాటకులను అనుమతించవద్దని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. డీటీ వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏలో కోర్టు కేసుల విచారణ జనవరి 27కి వాయిదా

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో ఈనెల 30న జరగాల్సిన కోర్టు కేసుల విచారణను అనివార్య కారణాల వల్ల వచ్చే నెల 27వ తేదీకి వాయిదా వేసినట్టు ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.కోర్టు కేసుల తాత్కాలిక వాయిదాను కక్షిదారులు గమనించాలని ఆయన కోరారు.

జిల్లాలో నేరాలు తగ్గుముఖం

- గంజాయి నిర్మూలన కార్యక్రమాలు విజయవంతం
- ప్రత్యామ్నాయంగా 7,328 ఎకరాల్లో వాణిజ్య పంటల సాగు
- ఏవోబీలో మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణ
- భారీగా మావోయిస్టుల అరెస్టులు, లొంగుబాట్లు
- ఎస్పీ సతీష్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్, పక్కన సీఐలు హిమగిరి, సుధాకర్

సాక్షి, పాడేరు: జిల్లాలో ఈ ఏడాది నేరాలు తగ్గుముఖం పట్టినట్టు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ కాంప్లెక్స్ ప్రెస్‌కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈఏడాది జిల్లాలో జరిగిన నేరాలు, వివిధ కేసుల నమోదు, గంజాయి నిర్మూలన, మావోయిస్టుల కార్యకలపాల నిరోధానికి చేపట్టిన చర్యలను వివరించారు. గంజాయి సాగు గతంలో కంటే భారీగా తగ్గిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 664.1ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశామని, వంద ఎకరాల్లో తోటలను గుర్తించామని, వాటిని కూడా తొందరలోనే ధ్వంసం చేస్తామన్నారు. గత ఏడాది గంజాయి తోటలను ధ్వంసం చేసిన మారుమూల గ్రామాల్లో 7,328 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు గిరిజన రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించినట్టు చెప్పారు. వాణిజ్య పంటల సాగుకు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. గంజాయి రవాణా నిరోధానికి పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది కృషి చేసినట్టు చెప్పారు. 56,255 కిలోల గంజాయిని సీజ్ చేసి, 794 మంది నిందితులను జైలుకు పంపినట్టు ఆయన తెలిపారు. ఈఏడాది 75 మంది గంజాయి నిందితులపై సస్పెక్టు కేసులు, 9మందిపై పీడీ యాక్టు నమోదు చేశామని చెప్పారు. సరిహద్దు ఒడిశాలో మారుమూల గ్రామాల పరిధిలో గంజాయి సాగు 80 శాతం ఉందని, డొంకరాయి,మోతుగూడెం,సీలేరు నదీ పరీవాహక ప్రాంతం,బలపం సమీప ఒడిశాలో గంజాయి సాగవుతోందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనకు ఒడిశా పోలీసు అధికారులతో చర్చిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు.

మావోయిస్టుల అరెస్టులు, లొంగుబాట్లు

జిల్లా పరిధిలో మావోయిస్టు కార్యకలాపాలను ఈఏడాది అడ్డుకున్నామని ఎస్పీ తెలిపారు. మావోయిస్టు పార్టీకి చెందిన కీలకనేతలు కొర్రా నాగేశ్వరరావు, అశోక్, బాలసుందరరావుతో పాటు మరో ఇద్దరు మావోయిస్టు నేతలను,16మంది మిలీషియా సభ్యులను అరెస్టు చేసినట్టు చెప్పారు. 38 మంది మావోయిస్టు కొరియర్లపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఆరు చోట్ల మావోయిస్టుల డంప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అభివృద్ధి లక్ష్యంతో పోలీసుల పిలుపు మేరకు 43మంది మావోయిస్టులు, 63మంది మిలీషియా సభ్యులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసి స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఏవోబీలో మావోయిస్టుల స్పెషల్ జోనల్ కమిటీ ప్రాబల్యం తగ్గిందన్నారు. చింతూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని సరిహద్దు ఛత్తీస్‌గఢ్ పరిధిలో మావోయిస్టు పార్టీకి చెందిన కుంట,శబరి,చర్ల ఏరియా కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయనే సమాచారంతో అప్రమత్తంగా ఉన్నామన్నారు.

ప్రేరణతో ఉపాధి అవకాశాలు

జిల్లాలో గిరిజన యువతకు ప్రేరణ కార్యక్రమం ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. 228 మంది గిరిజన యువతీయువకులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పారు. జిల్లాలో అక్రమ మద్యం, సారా కేసుల్లో 899మందిని అరెస్టు చేశామన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే నేరాల సంఖ్య తగ్గిందన్నారు. హత్య కేసులు 24.3శాతం, రోడ్డు ప్రమాదాలు 18శాతం తగ్గినట్టు తెలిపారు. బైక్‌ల చోరీ కేసుల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పోలీసుల సహకారంతో భారీగా రికవరీలు చేశామన్నారు. ఆరు హత్య కేసుల్లో నిందితులకు జీవితఖైదు, ఆరు లైంగికదాడి, వరకట్న హత్య కేసుల్లో నిందితులకు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షలను న్యాయమూర్తులు విధించారని ఆయన తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జలపాతాల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నామని, మరణాల సంఖ్య 50 శాతానికి తగ్గిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ హిమగిరి, పాడేరు సీఐ సుధాకర్‌లు పాల్గొన్నారు.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం

కలెక్టర్ సుమిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పాడేరు, జి.మాడుగుల, జీకే వీధి, చింతపల్లి మండలాల్లోని కాఫీ, ఉద్యానవన అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ లైజన్ వర్కర్లు అన్ని వారపుసంతలను సందర్శించి, వ్యాపారుల మోసాలను గుర్తించాలన్నారు. తక్కువ ధరలకు కాఫీ గింజలను వ్యాపారులు కొనుగోలు చేయడాన్ని,తప్పుడు తూకాలతో మోసాలను నియంత్రించే బాధ్యత లైజన్ వర్కర్లపై ఉందన్నారు. వారపు సంతలకు వెళ్లకుండా విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పార్చిమెంట్ కాఫీ గింజలను కిలో రూ.290, చెర్రి రకం కిలో రూ.180, పండ్లను రూ.50 ధరతో వ్యాపారులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు గ్రామాలను సందర్శించి, కాఫీ రైతులతో సమావేశాలు నిర్వహించాలని, కాఫీ కొనుగోలు ధరలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. చింతపల్లి మాక్స్ సంస్థకు కాఫీ రైతులు పండ్లను విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాఫీ ఏడీ అశోక్ మాట్లాడుతూ చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ ద్వారా 5 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను పల్పింగ్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. లక్ష్యసాధనకు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాఫీ ఏఈవోలు పాల్గొన్నారు.


విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



డుంబ్రిగుడ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి

డుంబ్రిగుడ: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి, బర్త్ వెయిటింగ్ హోమ్‌ను సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోనే ప్రసవాలు జరగాలని ఆదేశించారు. మాతాశిశుమరణాలను అరికట్టేందుకు వీలుగా కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణులను ఆస్పత్రి లేదా బర్త్ వెయిటింగ్ హోమ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కింద సాయం అందించేందుకు గర్భిణుల వివరాలు సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాంబాబు,ప్రేమ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌మాంచిగా వ్యాపారం



గుత్తులపుట్టు సంతలో వ్యాపారులు భారీగా కొనుగోలు చేసిన రాజ్‌మా గింజలు

కిలో రూ.75 ధరతో కొనుగోలు

సాక్షి,పాడేరు: గుత్తులపుట్టు వారపుసంతలో గురువారం రాజ్‌మా వ్యాపారం భారీగా జరిగింది. కిలో రూ.75 ధరతో మైదాన ప్రాంత,స్థానిక వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేశారు. జి.మాడుగుల,పెదబయలు, పాడేరు,హుకుంపేట మండలాల నుంచి గిరిజన రైతులు పెద్ద ఎత్తున రాజ్‌మా గింజలను తీసుకువచ్చి విక్రయించారు. సుమారు 200బస్తాల (ఒక్కో బస్తా 80 కిలోలు) వరకు విక్రయాలు జరిగాయి.

42 ఎకరాల్లో గంజాయి ధ్వంసం

మొక్కలను తగలబెట్టిన పోలీసులు



బిడిచంపా గ్రామ సమీపంలో గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న పోలీసులు



కొత్తవలసలో ధ్వంసం చేస్తున్న మహిళా పోలీసులు

ముంచంగిపుట్టు: దోడిపుట్టు, మాకవరం పంచాయతీల్లోని పలు గ్రామాల్లో గురువారం పోలీసులు 42 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేసి, తగలబెట్టారు. దోడిపుట్టు,మాకవరం పంచాయతీల్లోని బిడిచంపా,రాంపుట్టు,కిందుపుట్టు,మాకవరం గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు అందిన పక్కా సమాచారంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ఏపీఎస్‌పీ పోలీసులు, సివిల్ పోలీసులు బృందాలుగా ఏకకాలంలో దాడి చేశారు. మత్స్యగెడ్డ ఒడ్డున, పంట పొలాల్లో, కొండ ప్రాంతాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పూర్తిగా నరికి వేశారు. నరికిన మొక్కలను ఎక్కడికక్కడ కుప్పలుగా వేసి తగలబెట్టారు. గంజాయి పంట జోలికి పోవద్దని గిరిజనులకు ఎస్‌ఐ రవీంద్ర హెచ్చరించారు. గంజాయి పండించడం, రవాణా వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

డుంబ్రిగుడ మండలంలో..

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ కొత్తవలస గ్రామంలో ఒక ఎకరా భూమిలో సాగు చేస్తున్న గంజాయి తోటను ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు ఈశ్వరి,సీతమ్మ,ఇంద్రా తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ నర్సీపట్నం రాక నేడు

రెండు భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన



సాక్షి, అనకాపల్లి/నర్సీపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నర్సీపట్నం రానున్నారు. నర్సీపట్నం మండలం జోగునాథునిపాలెం గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఏలేరు–తాండవ అనుసంధాన పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. తన నివాసం నుంచి ఉదయం 9.20 గంటలకు బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని 9.30 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖకు బయలుదేరుతారు. 10.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకొని 10.25 గంటలకు హెలికాప్టర్‌లో నర్సీపట్నం వెళతారు. నర్సీపట్నం మండలం బలిఘట్టానికి 10.40 గంటలకు చేరుకొని అక్కడ 10.55 వరకు ప్రజాప్రతినిధుల్ని కలుస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.15 గంటలకు జోగునాథునిపాలెం చేరుకుంటారు. రెండు భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.50 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు వస్తారు. 15 నిమిషాలపాటు స్థానిక నేతలతో ముచ్చటించి, 1.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తిరిగి విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.



చూడముచ్చటగా స్వాగత కటౌట్లు

భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు

స్వాగత ద్వారాలు.. సీఎం కటౌట్లతో నర్సీపట్నం కళకళలాడుతోంది. అభివృద్ధి ప్రదాతకు అపూర్వరీతిలో ఆహ్వానం పలికేందుకు సర్వం సిద్ధమైంది. ప్రజల జీవనాన్ని సుఖమయం చేసే రెండు చక్కని నిర్మాణాలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనుండడంతో సర్వత్రా ఆనందం తాండవిస్తోంది. రూ.500 కోట్ల వ్యయంతో మెడికల్ కాలేజీ నిర్మాణంతో వైద్య విద్య అందుబాటులోకి రావడమే కాక దానికి అనుబంధంగా నెలకొల్పే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. రూ.470.05 కోట్లతో చేపట్టే ఏలేరు–తాండవ ఎత్తిపోతల పథకం వల్ల నీటి సదుపాయం మరింత పెరిగి పంట పొలాలకు జవసత్వాలను ఇస్తుంది. ఈ రెండు బృహత్తర పథకాలకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, డీఐజీ హరికృష్ణ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురామ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎం సభకు వేదికను చక్కగా తీర్చిదిద్దారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాంగణాన్ని రూపొందించారు.



సిద్ధమైన సీఎం సభాస్థలి

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన

సాక్షి,పాడేరు: అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స నిర్వహించడంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రెడ్ క్రాస్ సొసైటీ గురువారం అవగాహన సదస్సు నిర్వహించింది. ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తస్రావం సమయంలో కట్టుకట్టే విధానం,ఆస్పత్రికి తరలింపు వంటి చర్యలపై రెడ్ క్రాస్ సమన్వయకర్త కోటేశ్వరరావు,ఇతర సిబ్బంది అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి,ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అరకు స్పెషల్‌కు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ విశాఖపట్నం– అరకు– విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలుకు అదనపు కోచ్‌లను జతచేసేందుకు నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ప్రతీ శని, ఆదివారాల్లో బయల్దేరే విశాఖ–అరకు(08501) స్పెషల్ రైలుకు డిసెంబరు 31, జనవరి 1,7,8,14,15,21,22 తేదీల్లో 7 స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో అరకులో ప్రతీ శని, ఆదివారాలలో బయల్దేరే అరకు – విశాఖ(08502) స్పెషల్‌కు డిసెంబరు 31, జనవరి 1,7,8,14,15,21,22 తేదీలలో 7 స్లీపర్‌క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. ఈ రోజులలో ఈ రైళ్లు 7–స్లీపర్‌క్లాస్, 7–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కం లగేజీ కోచ్‌లతో నడవనున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

తొలి వెలుగులో.. తెలి మంచు సోయగం



మన్యంలో వేకువజామున తెలి మంచు బిందువులు చినుకుల్లా రాలి పరిసరాలకు కొత్త అందాలను తెస్తున్నాయి. దట్టంగా కురుస్తున్న మంచుతో గిరులు, తరులు తడిసి ముద్దవుతున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా తూర్పు వాకిట వెలుగురేఖలు ప్రసరించడం లేదు. మంచు తెరల మాటున సూరీడు దోబూచులాడుతున్నాడు. మరోవైపు మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుముఖం పట్టడంతో గిరిజనులు చలికి గజగజ వణుకుతున్నారు.

-రాజవొమ్మంగి/సాక్షి పాడేరు







బైక్ ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి



లైకోన్ మృతదేహం

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ వనుగుపుట్టు సమీపంలో బుధవారం జరిగిన బైక్ ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందాడు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మృతుని భార్య ఫిర్యాదుతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. సుజనపేటకు చెందిన కరింగ్య లైకోన్(32) తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి సొంత పనుల నిమిత్తం బైక్‌పై వెళ్లాడు. బయటకు వెళ్లేటప్పుడు పూర్తిగా మద్యం సేవించి ఉన్నాడు. సాయంత్రం అయ్యేసరికి వనుగుపుట్టు గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో ఉన్నాడు. స్థానికులు కటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. లైకోన్ భార్య సుందరమ్మ హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకొని చూడగా అప్పటికే మృతి చెంది ఉండడంతో గుండెలవిసేలా రోధించారు. మృతుని భార్య సుందరమ్మ 9 నెలల గర్భిణి కావడంతో ఈ వార్త విన్నవారి హృదయాలు మరింత బరువెక్కాయి.

గురుకులం ప్రిన్సిపాల్‌గా వేణుప్రసాదరావు



జి.మాడుగుల: స్థానిక గురుకులం పాఠశాల (ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల) ప్రిన్సిపాల్‌గా వేణుప్రసాదరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతగిరి మండలం గుమ్మకోట గురుకులం ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన ప్రిన్సిపాల్ శర్మ కొన్ని ఆరోపణలు నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు సరెండర్ చేశారు. నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించటం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు.

పీఎం కిసాన్‌కు రేపే తుది గడువు

- పథకం లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి
- నాలుగు మండలాల్లో 6,891 మంది రైతులు
- 3,040 మంది మాత్రమే అర్హులు



అడ్డతీగల: రైతులు పీఎం కిసాన్ ప్రోత్సాహక నిధులు పొందడానికి గడువు ముంచుకొస్తోంది. ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమ కావాలంటే ఈ-కేవైసీ నమోదు కావాలి. దీని గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుండటంతో వ్యవసాయశాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అడ్డతీగల వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని అధికారిక లెక్కల ప్రకారం మండలాల వారీగా రైతుల వివరాలు పరిశీలిస్తే... అడ్డతీగల – 2,413 మంది, గంగవరం – 2,103 మంది, రాజవొమ్మంగి – 1,347 మంది, వై.రామవరం – 1,028 మంది వెరసి 6,891 మంది రైతులు ఉన్నారు. నాలుగు మండలాల్లోనూ కలిపి డెత్‌లే 799 ఉన్నాయి. 1,812 మంది వలస పోయారు. గంగవరం మండలంలో ఇలా వలస పోయినవారు అత్యధికంగా 1,055 మంది ఉన్నారు. ఈ– కేవైసీ నమోదులో భాగంగా బయోమెట్రిక్ (వేలిముద్రల నమోదు) కాని వారు నాలుగు మండలాల్లో 190 మంది ఉన్నారు. ఆచూకీ దొరకని రైతులు 464 మంది ఉన్నారట. భూమిలేని రైతులు మాత్రం 286 మంది ఉన్నట్లు తేల్చారు. ఈ -కేవైసీ చేయించుకోని ఇతర వర్గాల వారు 300 మంది నమోదయ్యారు. మొత్తం మీద నాలుగు మండలాల్లో వివిధ కారణాలతో అందుబాటులో ఉన్న అధికారిక లెక్కల ప్రకారం 3,851 మంది ఈ-కేవైసీ చేయించుకోలేని వారు ఉన్నారు. 3,040 మంది మాత్రమే ఈ– కేవైసీ చేయించుకుని పీఎం కిసాన్ నిధులు పొందడానికి అర్హులుగా వ్యవసాయశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. వందశాతం రైతులు ఈ-కేవైసీ చేయించుకుని పీఎం కిసాన్ నిధులు పొందడానికి ఉన్న ఏ అవకాశాన్ని విడిచి పెట్టకుండా విస్తృతమైన ప్రచారాన్ని వ్యవసాయశాఖ అధికారులు చేస్తున్నారు.

గ్రామాల వారీగా రైతులకు అవగాహన



గ్రామాల వారీగా క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. అధికారిక లెక్కల ప్రకారం ప్రతి రైతు పీఎం కిసాన్ పథకం నిధులు పొందేలా అవసరమైన విధంగా ఈ– కేవైసీ నమోదు చేయించడానికి కార్యాచరణ అమలు చేస్తున్నాం. స్వస్థలాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ప్రతి రైతు ఈ– కేవైసీ నమోదు చేయించుకోవాలి.

– కె.సావిత్రి, ఏడీఏ

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో అనూష

రాజవొమ్మంగి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఎంత మాత్రం తగదని రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో టి.అనూష సిబ్బందికి సూచించారు. ఆమె గురువారం రాజవొమ్మంగి పీహెచ్‌సీని సందర్శించారు. సిబ్బందికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మందుల గది, ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు పరిశీలించారు. ఎక్కడ చూసినా నిర్వహణా లోపం కనిపిస్తోందని సిబ్బంది పని తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. త్వరలో ఢిల్లీ నుంచి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ టీం (ఎన్‌క్యూఏఎస్) ఇక్కడకు వచ్చి పరిశీలించనుందన్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది పూర్తి అప్రమత్తతో ఉండాలని సూచించారు. రోగులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. డాక్టర్ నవీన (డీసీపీహెచ్), వైద్యాధికారి శ్రీదుర్గ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

వంద రోజుల వేడుకల్లో ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కిన్నెర్లలో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి/చింతపల్లి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కిన్నెర్లలో గురువారం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపాలెం, భీమసింగి, జున్నుల, పినపాడు బొంగూడ, తీగల మెట్ట, పెదపాకలు, కొత్తబంధ గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ల సేవలు వల్ల ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పింఛన్లు ఇంటి వద్దకే చేరవేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగన్‌కు రుణపడి ఉంటారని తెలిపారు. రానున్న 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా జగన్ కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని 22 సచివాలయాలకు సంబంధించి 66 మందిని కన్వీనర్లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులకు పింఛన్లు తొలగిస్తున్నట్లు ప్రతి పక్షాలు, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ విషయమై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు, ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీడీవో లాలం సీతయ్య, వైస్ ఎంపీపీ గోపినాయక్ శారద, కొత్తపాలెం సర్పంచ్ వనగల సోమరత్నం, పార్టీ మండలాధ్యక్షుడు మోరి రవి పాల్గొన్నారు.

ప్రజా సేవకులే గ్రామ వలంటీర్లు

అవగాహన సదస్సులో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: గ్రామ సచివాలయ పరిధి గ్రామాల్లో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా సేవ చేసేవారే గ్రామ వలంటీర్లు అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం అరకు సంతబయలు గ్రామ మార్కెట్ యార్డ్‌లో అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జనవరి నూతన సంవత్సరం కానుకగా పెంచిన రూ.250తో కలిపి రూ.2,750 పింఛన్ అవ్వ,తాతలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీయే అన్నారు. గ్రామ స్థాయిలో అందరికీ సంక్షేమ పథకాలు అందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. కొంతమంది గ్రామ వలంటీర్లు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సీఎం వద్దకు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీలు బాక ఈశ్వరి, ఉషారాణి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, శారద, సుబ్బారావు, వెంకటరావు, ఎంపీటీసీ వరహాలమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, పార్టీ మహిళ మండలాధ్యక్షురాలు శాంతి, ఏఎంసీ చైర్మన్ రాజరమేష్, డైరెక్టర్ గురు, బీబీ సాధ్రు, సీనియర్ నాయకులు శ్రీరాములు, బాక సింహాచలం, కృష్ణారావు, గణపతి, నర్సింగ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కన్వీనర్లు

కేంద్ర విధానాలతో ప్రభుత్వ రంగానికి చేటు

ఉభయగోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరావు

అనకాపల్లిటౌన్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశాన్ని అమ్మేసే పరిస్థితులను తెచ్చిందని ఉభయగోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాలులో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి అధ్యక్షతన గురువారం జరిగిన 4వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేసేందుకే ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారన్నారని ఆరోపించారు. ఈ రంగాల్లో పని చేస్తున్న లక్షలాది ఉద్యోగులను తొలగించే విధంగా విధానాలున్నాయన్నారు. కార్మిక చట్టాలను మార్చేసి సంఘాలు లేకుండా చేసి యాజమాన్యాలను చుట్టాలను చేసుకుందన్నారు. వీవోఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. వీవోఏలు చేస్తున్న పోరాటాలపై శాసనమండలిలో ప్రశ్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా వీవోఏల సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్వితీయంగా సంబరాలు

- రెండో రోజు హుషారుగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న థింసా నృత్యం



అనంతగిరి-జి.కే.వీధి విద్యార్థుల మధ్య ఖోఖో పోటీలు



బయోగ్యాస్ ఉత్పత్తులపై పాడేరు ఇంగ్లిషు మీడియం విద్యార్థినుల నమూనాలను పరిశీలిస్తున్న కెన్యా దేశస్తురాలు జోయ్

సాక్షి,పాడేరు: గిరిజన విద్యార్థుల విజ్ఞానాన్ని, క్రీడా ప్రతిభను,సాంస్కృతిక కళా ప్రదర్శనలను తోటి గిరిజన సమాజానికి చాటి చెప్పేందుకు పాడేరు ఐటీడీఏ ఏర్పాటు చేసిన గిరి విజ్ఞాన సంబరాలు రెండవ రోజు గురువారం ఉత్సాహంగా జరిగాయి. తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో గురువారం ఉదయం నుంచే సంబరాల్లో గిరిజన విద్యార్థినీవిద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు. ఆట పాటలతో సందడి చేశారు. పలు గిరిజన విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు థింసా నృత్యాలతో హోరెత్తించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థినులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కబడ్డీ,వాలీబాల్,ఖోఖో పోటీలతో క్రీడా మైదానంలోనూ సందడి నెలకొంది.

ఆకట్టుకున్న నమూనాలు

పాడేరు ఐటీడీఏ పరిధిలోని 122 గిరిజన విద్యాలయాలకు చెందిన 1100 మంది గిరిజన విద్యార్థులు పలు అంశాలకు సంబంధించి 577 నమూనాలను తలారిసింగి పాఠశాలలో, ఇండోర్ స్టేడియంలో ప్రదర్శించారు. వీటిని వీక్షించేందుకు అన్ని వర్గాల ప్రజలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ.. నృత్య రూపకాలను వీక్షించి అభినందించారు. గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావుతో పాటు, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు ఈ సంబరాలను పర్యవేక్షించారు.



థింసా నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థినులు



సంబరాలను తిలకిస్తున్న పీవో గోపాలకృష్ణ, అధికారులు

కార్మిక హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న నరసింగరావు

సీతమ్మధార (విశాఖ ఉత్తర) : స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగాలు, కార్మిక హక్కులు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్. నరిసింగరావు అన్నారు. మహాయాత్ర నిర్వహించారు. తగరపువలస, డెయిరీ ఫారం, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మిక చైతన్య యాత్ర నిర్వహించారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్ర 16వ మహాసభలు భీమవరంలోని వచ్చే నెల 2,3,4 తేదీలలో జరుగుతాయన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటు పరం చేయాలని కంకణం కట్టుకున్న కేంద్రం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంగవరం, కృష్ణపట్నం పోర్టులను ఆదానీకి అప్పగించిందన్నారు. విశాఖ అభివృద్ధికి, ప్రభుత్వ రంగాలను కాపాడుకునేందుకు పోరాడతామన్నారు. రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తొలగిస్తోందని మండిపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబిరాణి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అమ్మన్న నాయుడు, తేజ, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.జ్యోతీశ్వరరావు, కె.ఎం.కుమార్ మంగళం, బి.జగన్ పాల్గొన్నారు.